ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
5
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

వైసీపీ పాలనలో.. ఇష్టారాజ్యం..!

వైసీపీ ప్రభుత్వంలో 2022-23-24లో జిల్లాకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేసి దారిమళ్లించి లక్షల రూపాయలు మింగేశారు. ఒంటిమిట్ట, తొండూరు, సుండుపల్లె మండలాల్లో నిధుల గోల్‌మాల్ జరిగినట్టు జనవరి 31వ తేదీన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో.. జిల్లా అంతటా ఇదే తరహా జరిగి ఉంటుందని అధికారులు భావించి నిఘా పెట్టారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 50 మండలాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు.. నిధుల కేటాయింపులు.. చేపట్టిన పనులు.. ఎం.బుక్‌లు.. పాస్‌బుక్‌లు.. నగదు పుస్తకం.. ఓచర్లు తదితర వివరాలను ఆడిట్ చేయించాలని ఆదేశించారు. దీంతో ఆయా మండలాల నుంచి జడ్పీ కేంద్ర కార్యాలయానికి ఫైళ్లు చకచకా కదిలివస్తున్నాయి.

గతంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనం


ఆంధ్రజ్యోతి కడప
అరకోటి నొక్కేశారు..!

- 15వ ఆర్థిక సంఘం నిధులలో అంతులేని అక్రమాలు
- అవినీతికి కేరాఫ్‌గా మండల పరిషత్, గ్రామ పంచాయతీలు
- కోట్ల రూపాయల గోల్‌మాల్
- నిధుల ఖర్చుపై 8 బృందాలతో ఆడిట్
- కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు నివేదిక


ఆయా మండలాల 15 ఆర్థిక సంఘం నిధుల వివరాలపై ఆరా తీస్తున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ

కడప రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన ఇష్టారాజ్యంగా కొనసాగింది. మండల పరిషత్, గ్రామ పంచాయతీలను అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చింది. అప్పటి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల మాటున 95 శాతం మండల పరిషత్‌లను, 80 శాతం గ్రామ పంచాయతీలను కైవసం చేసుకుని మండల పరిషత్, గ్రామ పంచాయతీ పరిపాలనను శాసించారు. వెరసి ఎంపీడీవో స్థాయి నుంచి కింది స్థాయి వరకు జీ హుజూర్ అంటూ పనిచేశారు. దీంతో వైసీపీ ప్రజాప్రతినిధుల అండదండలున్న కొందరు అధికారులు, ఉద్యోగులు 15వ ఆర్థిక సంఘం నిధులలో అంతులేని అక్రమాలకు తెగబడ్డారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లల్లో నిధులను గోల్‌మాల్ చేసి సొంతఖాతాలకు మళ్లించుకున్నారు. వారి అకౌంట్ల నుంచి కాంట్రాక్టర్లకు కొంత చెల్లించి మిగిలినది అప్పనంగా ఆరగించారు. మండల పరిషత్ వాటా నిధులతో పాటు గ్రామ పంచాయతీ వాటా నిధులను ఒంటిమిట్ట, తొండూరు, సుండుపల్లె తదితర మండలాల్లో అందినకాడికి దోచేశారు. ఈ విషయాన్ని జనవరి 31వ తేదీన 'అరకోటిని నొక్కేశారు' అంటూ ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీ అధికారులు లోతుగా సమగ్రమైన విచారణ జరిపించారు. రూ.లక్షల మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఒంటిమిట్ట మండలంలో రూ.19 లక్షల 17వేలు, తొండూరు మండలంలో రూ.22 లక్షలు, సుండుపల్లె మండలంలో రూ.5 లక్షల వరకు చేతివాటాన్ని ప్రదర్శించి అప్పనంగా తినేసినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ఆరుగురు అధికారులు, ఉద్యోగులపై వేటుకు రంగం సిద్ధం చేసి సంబంధిత నివేదికను కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు పంపించారు.

బాధ్యులపై చర్యలు

ఆయా మండల కార్యాలయాల్లో 15 ఆర్థిక సంఘం నిధులు గోల్‌మాల్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై శాఖపరమైన చర్యలకు ఉపక్రమించాం. ఇందుకు సంబంధించిన నివేదికను కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు పంపాము. ఒంటిమిట్టలో పనిచేసిన ఎంపీడీవోలు రెడ్డెయ్య, సోమశేఖర్, కుమార రంగయ్యతో సహా సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ ఆలీబేగ్, ఫిట్టర్ జనార్ధన్ సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్‌ను కలెక్టర్ అప్రూవ్ చేశారు. ఆయన నుంచి ఏ క్షణమైనా ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఈ ఆఫీస్ ద్వారా జడ్పీకి రానున్నాయి.

డీపీఆర్‌సీలో ముమ్మరంగా ఆడిట్

ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు చెందిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై గురువారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీలో సీఈవో సి. ఓబుళమ్మ పర్యవేక్షణలో ఆడిట్ చేపట్టారు. ఇందుకు 8 బృందాలను ఏర్పాటుచేసి ఒక్కొక్క బృందానికి 6 నుంచి 7 మండలాలను కేటాయించారు. ఆయా మండలాలకు సంబంధించి 2022-33-24 ఆర్థిక సంవత్సరాల్లో ఖర్చుచేసిన నిధులపై క్షుణ్ణంగా ఆడిట్ చేపట్టారు. ఈ ఆడిట్‌లో పలు మండలాల్లో నిధుల ఖర్చుకు సరైన వివరాలు లేనట్లు గుర్తించారని సమాచారం.

అవినీతి ఉద్యోగులలో అలజడి

మండల పరిషత్ కార్యాలయాలకు మంజూరైన 15వ ఫైనాన్స్ నిధులలో చేతివాటంపై ఒట్టిమిట్ట, తొండూరు, సుండుపల్లె మండలాల్లో విచారణ చేపట్టడం బాధ్యులపై వేటుకు రంగం సిద్ధం కావడంతో.. ఉమ్మడి జిల్లాలోని పలు ఎంపీడీవో కార్యాలయాల్లోని అవినీతి ఉద్యోగులలో అలజడి చోటుచేసుకుంది. ఇప్పటికే విచారణ జరుగుతున్న మండలాల్లో ఒంటిమిట్టలో రూ.19 లక్షలు, తొండూరులో రూ.22 లక్షలు, సుండుపల్లెలో రూ.5 లక్షల మేర గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించి బాధ్యులపై చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఇతర మండలాల్లో కూడా 15 ఆర్థిక సంఘం నిధుల అవకతవకలకు ఆస్కారం కల్పించిన అధికారులలో దడ పట్టుకుంది.


డీపీఆర్‌సీలో 15వ ఆర్థిక సంఘం నిధులపై ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు


చిన్నవెంతుర్లలో ఆక్రమణకు గురైన పీర్లమాన్యం భూమి

పీర్ల మాన్యం భూముల ఆక్రమణ

- వైసీపీ వారు ఆక్రమించారని ముజావర్ల ఫిర్యాదు
- రైతు సదస్సులో ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలంలోని బెస్తవేముల పంచాయతీ పరిధిలోని చిన్నవెంతుర్లలో పీర్లమాన్యం భూమి ఆక్రమణకు గురైంది. 161 సర్వే నంబరులో ఖాతానంబరు 42లో దాదాపు అయిదు ఎకరాల పొలాన్ని ఆక్రమించారని చిన్నవెంతుర్లలోని పీర్లచావిడి ముజావర్లు వాపోయారు. వారు పూర్వం నుంచి వంశరీత్యా పీర్లచావిడిలో ముజావర్లుగా పనిచేస్తూ ఆ భూముల నుంచి వచ్చే ఆదాయాన్ని చావిడిలో అవసరాలకు, అభివృద్ధికి వినియోగించేవారు. 161/1, 161/2, 161/3, 161/4 నంబర్లలో దాదాపు అయిదు ఎకరాల స్థలం ఆక్రమణకు గురైందని గూడుబాయిగారి పెద్దమౌలాలి, ఫక్రుద్దీన్, చిన్నమౌలాలి తదితరులు తెలిపారు. గ్రామంలో వైసీపీ వారు పీర్లమాన్యం భూమి ఆక్రమించి తమకు ఇబ్బంది కలిగిస్తున్నారని ముజావర్లు తెలిపారు. వైసీపీ నాయకులు మహిళల పేర్లతో పాస్‌పుస్తకాలు ఆన్‌లైన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ వారు మాన్యం భూములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని వాటిలో వచ్చే ఆదాయాన్ని పీర్లచావిడి, దర్గాకు మాత్రమే ఉపయోగపడేలా చేయాలని అధికారుల చుట్టూ తాము తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు.

రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసినా..

మాన్యం భూములు వారిపేర్లతో ఆన్‌లైన్ చేసుకోవడమే కాకుండా ప్రభుత్వ పథకాలు సైతం పొందారని ఆరోపణలు చేశారు. దీనిపై గత ఏడాది డిసెంబరు 6వ తేదీన బెస్తవేములలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో, అదేనెల 24వ తేదీన చిన్నవెంతుర్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించినప్పుడు మైలవరం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే అధికారులు ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. దీంతో తాము తిరిగి ఈ నెల 2వ తేదీన కలెక్టర్ శ్రీధర్‌కు నేరుగా ఫిర్యాదు చేసి అందుకు సంబంధించిన పత్రాలన్నీ సమర్పించి న్యాయం చేయాలని కోరామన్నారు. వైసీపీ వారు పీర్లమాన్యం భూములను ఆక్రమించి వారి పేర్లతో ఆన్‌లైన్ చేయించుకున్నారని, దానిని రద్దుచేసి ఆ భూములు పీర్లచావిడికి చెందేలా చేయాలని వారు కోరుతున్నారు. కాగా.. చిన్నవెంతుర్లలో మాత్రమే కాదు.. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల పీర్లమాన్యం భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఉన్నతాధికారులు దీనిపై దర్యాప్తు చేపడితే బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉందని అంటున్నారు.


రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేస్తున్న బాధితులు (ఫైల్‌ఫొటో)

ఇన్‌చార్జి కలెక్టర్‌గా అదితిసింగ్

కలికిరి/కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను ఇన్‌చార్జి కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం నుంచి పంజాబ్‌లోని మొహాలీ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో రెసిడెన్సీ-3 కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఐఎస్‌బీలో జరిగే ఈ అడ్వాన్స్‌డ్ మేనేజిమెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ (ఏఎంపీపీపీ) కార్యక్రమంలో ఐదు రోజులు పాల్గొనడానికి ప్రభుత్వం అనుమతించింది. దీనికోసం శుక్రవారం నుంచి 25వ తేదీ వరకూ ఆన్ డ్యూటీ కింద అనుమతి మంజూరు చేసింది. ఈ ఐదు రోజులూ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

రసవత్తరం.. కార్పొరేషన్ రాజకీయం

- మేయర్ శిబిరంలో టెన్షన్ టెన్షన్
- సురేశ్‌బాబుపై అనర్హత వేటు అస్త్రం?
- సర్వత్రా ఉత్కంఠ

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఎనిమిది మాసాలు దాటుతున్నా కడప కార్పొరేషన్‌లో మాత్రం రాజకీయ వేడి తగ్గడమే లేదు. కార్పొరేషన్ సర్వసభ్యసమావేశంలో ఎమ్మెల్యే ఆర్.మాధవి, మేయర్ సురేశ్‌బాబు మధ్య మొదలైన కుర్చీ పోరు రోజురోజుకూ రసవత్తరంగా మారుతోంది. ఇటీవల వైసీసీ వారికి చెందిన వాటర్‌ప్లాంటు తొలగింపు కూడా రాజకీయ రంగు పులుముకుంది. ఈ సంఘటనలు మరువకముందే ఇప్పుడు మేయర్ కె.సురేశ్‌బాబుపై అనర్హత వేటు అస్త్రం టీడీపీ వారికి అందివచ్చింది. ఇది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. మేయరుపై అనర్హత వేటు పడుతుందని ఓ వర్గం సంబరపడుతుండగా.. అలాంటిదేమీ ఉండదంటూ సురేశ్‌బాబు వర్గం అంటుంది. అసలు ఏం జరిగిందంటే..

మున్సిపల్ కార్పొరే షన్ యాక్టు 1955 సెక్షన్ 22 (1) మేరకు ఎన్నికైన కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్లు వారి కుటుంబ సభ్యులు కానీ ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ కాంట్రాక్టు పనులు చేయకూడదు. అలా చేస్తే వారు అనర్హత వేటుకు గురవుతారని చెబుతారు. అయితే మేయర్ సురేశ్‌బాబు భార్య జయశ్రీ, కొడుకు అమరేశ్‌లు వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరిట కాంట్రాక్టర్లుగా నమోదు చేశారు. ఈ సంస్థ ఇటీవల కార్పొరేషనులోని మినీ బైపాస్‌లో రివిట్‌మెంటు పనులు, ఫక్కీరుపల్లె, శ్రీనగర్‌కాలనీలో రహదారుల రోడ్ల పనులు చేపట్టారు. అగ్రిమెంటు కూడా చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు అందడంతో విజిలెన్స్ ఎంక్వయిరీ విచారణ చేపట్టింది. కుటుంబ సభ్యులు పనులు చేసినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. నివేదికను ప్రభుత్వానికి పంపించారు. కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి మేయర్ సురేశ్‌బాబుకు లేఖ రాశారు. ఈ విషయమై మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ మేయరు కుటుంబ సభ్యులు కార్పొరేషనులో ఎన్ని కోట్లతో ఎన్ని పనులు చేశారన్నది తనకు తెలీదన్నారు. విజిలెన్స్ అధికారులు నివేదికలు సమర్పించారని అందులో కార్పొరేషన్‌కు సంబంధించిన రూల్స్‌ను కూడా పొందుపరిచారన్నారు. ఈ విషయం మేయరుకు తెలిపేందుకు లేఖ రాశాను తప్ప నోటీసు ఇవ్వలేదన్నారు.

అయితే తనకు ఏ లేఖ అందలేదని మేయర్ సురేశ్‌బాబు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. మరో ఏడాదిలో మేయర్ పదవీ కాలం పూర్తికానుంది. ఈ నేపథ్యంలో ఏం జరుగుతుందోనన్న చర్చ కడప కార్పొరేషన్‌లో నడుస్తోంది.

పులివెందులలో.. రాళ్లు రువ్వుకున్న వైసీపీ వర్గాలు

- 8 మందికి గాయాలు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఇరువర్గాలు రాళ్ల దాడి చేసుకోవడంతో 8 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు గురువారం పులివెందుల పట్టణంలోని ఫైర్‌స్టేషన్ పక్కన సియోనుపురం కాలనీకి చెందిన వైసీపీకి చెందిన యువకుల మధ్య మనస్పర్థల కారణంగా ఇరువర్గాలు బండరాళ్లు, కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేయడంతో పి.ప్రదీప్, ప్రతాప్, హరి, రవికుమార్, జ్యోతి, ప్రకాశ్, మోసయ్య, శ్యామ్యుల్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. హరి అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో కడపకు రెఫర్ చేశారు. సంఘటన స్థలాన్ని పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు, సిబ్బంది పరిశీలించారు. దాడికి సంబంధించి అర్బన్ సీఐ మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో చిన్న పిల్లల మధ్య జరిగిన గొడవ పెద్దలకు తెలియడంతో గురువారం సాయంత్రం ఇరువర్గాలు దాడి చేసుకున్నాయన్నారు. గాయపడ్డ వారు చికిత్స పొందుతున్నారని చికిత్స పూర్తయిన తరువాత పూర్తి వివరాలు సేకరించి ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామన్నారు.


రాళ్లదాడిలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు

వాటర్‌షెడ్ల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ డెవలప్మెంట్ కమిటీ(డబ్ల్యూడీసీ)లను సమర్థవంతంగా నిర్వహిస్తూ అనుబంధ శాఖల సమన్వయంతో వచ్చే ఏడాది జిల్లాలో లక్ష ఎకరాలను సాగులోకి తీసుకురావాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో డబ్ల్యూడీసీ ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ రకాల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ షెడ్లు, ఫారంపాండ్లు, ఇంకుడు గుంతలు, స్మార్ట్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్టభూములను సాగులోకి తేవాలన్నారు. సాగులోకి తీసుకువచ్చిన వ్యవసాయ భూముల్లో సహజ పద్ధతుల ద్వారానే సేంద్రియ వ్యవసాయ సాగును అనుసరించి దిగుబడులు సాధించాలన్నారు. రానున్న మూడేళ్లలో ఎంపిక చేసిన 109 గ్రామాల్లో మొత్తం పచ్చదనంతో నింపాలన్నారు. ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేసి 100 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ప్రారంభించాలన్నారు. బయోడైవర్సిటీ విధానం ద్వారా అన్ని రకాల పంటలు పండించేలా రైతులను, యువతను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, వ్యవసాయ జిల్లా అధికారి నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి, డీఆర్డీయే పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ సర్వేని సమర్థవంతంగా నిర్వహించాలి

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన పీపుల్స్ సర్వేని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పీ-4 విధానం (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్ట్నర్ షిప్) ద్వారా పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చడానికి, జీవన ప్రమాణాలు, అట్టడుగు స్థాయిలో గల 20 శాతం మంది పేదలను గుర్తించడానికి నిర్వహించనున్న సర్వేపై జడ్పీ సీఈవో, డీపీవో, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు పేదరికాన్ని అధిగమించి ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం పీ-4 పాలసీని అమలు చేస్తోందన్నారు. గురువారం నుంచి మార్చి 2వ తేదీ వరకు సర్వ చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.


15వేల హెక్టార్ల లక్ష్యాన్ని సాధించాలి

- సూక్ష్మనీటి సాగు పథకం ఓఎస్డీ డి.రమేశ్

కడప రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన 15వేల హెక్టార్ల లక్ష్యాన్ని సకాలంలో పూర్తిచేయాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం ఓఎస్డీ డి.రమేశ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం కార్యాలయంలో గురువారం కంపెనీ ప్రతినిధులకు, క్షేత్రస్థాయి అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన 15 వేల హెక్టార్ల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 8,666 హెక్టార్లకు చేరుకున్నామన్నారు. మిగతా లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కంపెనీ ప్రతినిధులకు సూచించారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సూక్ష్మసేద్య పరికరాల అవసరం ఉన్న రైతులను గుర్తించి ప్రాథమిక తనిఖీలు చేపట్టి డ్రిప్ పరికరాలను సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎస్డీ డి. రమేశ్



13 కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 23వతేదీ ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూపు-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు 13 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో గ్రూపు-2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత లైజాన్ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయన్నారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు ఉదయం 8-30 నుంచి 9-45 లోగా, మధ్యాహ్నం 1-30 నుంచి 2-45 గంటలలోగా అనుమతిస్తామన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా లైజాన్ అధికారులు, చీఫ్ సూపర్‌వైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రూపు-2 పరీక్షలకు సంబంధించి ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ 08562-246344 నెంబరుకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఏపీపీఎస్సీ ప్రత్యేకాధికారులు శారద, అసిస్టెంట్ సెక్రటరీ జయంతి, యశోద, సునీత పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ఇంత నాసిరకమా..?

- ప్రశ్నించిన రెవెన్యూ చీఫ్ స్పెషల్ సెక్రటరీ
- రీసర్వేపై మరింత దృష్టి పెంచాలని ఆదేశం

చెన్నూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఇంత నాసిరకంగా ఉన్నాయేంటి అంటూ రెవెన్యూ చీఫ్ స్పెషల్ సెక్రటరీ సిసోడియా ప్రశ్నించారు. ఇంత చిన్నవిగా, ఇంత నాసిరకంగా ఉంటే ఇందులో ఎలా నివాసం ఉంటారని అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పరిపాలనా విభాగం కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన తిరుగు ప్రయాణంలో చెన్నూరు రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, మ్యాప్‌లను పరిశీలించడంతో పాటు ఇప్పటి వరకు రీసర్వే ఎంత జరిగింది, ఎలా చేస్తున్నారు అని తహశీల్దారు సరస్వతిని ప్రశ్నించారు. ప్రతి గదిలోకి వెళ్లి ఆ గదిలో సిబ్బంది ఎలాంటి విధులు నిర్వహిస్తారు, అక్కడ రికార్డులు ఎలా మెయింటెనెన్స్ చేస్తున్నారు, సమస్యల తో వచ్చే ప్రజల పట్ల ఎలా ఉంటున్నారు, వారికిచ్చే సమాధానాలు, రైతులు సంతృప్తిగా ఉన్నారా లేదా వంటివాటిపై ప్రశ్నించారు.

అనంతరం బలసింగాయపల్లె పంచాయతీలోని కనుపర్తి గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని పరిశీలించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న ఇళ్లను, చేస్తున్న పనులను చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటుకలు నాసిరకంగా ఉన్నాయని, సిమెంటు కన్నా ఇసుకే ఎక్కువగా కనిపిస్తోందన్నారు. పైగా ఇంత చిన్న ఇంటిలో లబ్ధిదారుడు ఎలా ఉంటాడని ప్రశ్నించారు. అక్కడ పనులు చేపట్టే వారితో మాట్లాడుతూ.. నిర్మాణాలు నాణ్యతగా ఉండాలని ఇప్పుడు ఇల్లు మంజూరైన వారికి భవిష్యత్తులో మరో ఇల్లు మంజూరయ్యే అవకాశం లేదని, ఇల్లు ఇచ్చేటప్పుడే కాస్త స్థలం పెద్దదిగా ఇచ్చి ఉంటే బాగుండేది అన్నారు. అలాగే వెంట వచ్చిన కడప ఆర్డీవో పాలపర్తి జాన్ ఎర్విన్‌తో కలసి జగనన్న కాలనీకి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు డీటీ వెంకటరమణ, ఆర్ఐ కౌశిక్, వీఆర్వోలు వినోద్‌బాబు, భాస్కర్‌రెడ్డి, రసూల్, శివ, వేణు, శివకుమార్, సర్వే డీటీ అర్చన పాల్గొన్నారు.


చెన్నూరు మండలం బలసింగాయపల్లెలోని జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ చీఫ్ స్పెషల్ సెక్రటరీ సిసోడియా

అందాల అడవిలో మూడు కొండల మల్లన్న



తంబళ్లపల్లె, ఆంధ్రజ్యోతి


తంబళ్లపల్లెకు సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 1500 అడుగుల ఎత్తులో మల్లయ్యకొండపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని విజయనగరరాజు వీరదేవరాయ-1 ధన సహాయంతో ఏకిల దొరలు నిర్మించినట్లు చెబుతోంది. శిథిలస్థితికి చేరుకున్న మల్లయ్యకొండ ఆలయాన్ని మూడేళ్ల కిందట పునరుద్ధరించారు. ఆలయ మండపంలో కుడి వైపున వీరభద్ర స్వామి, ఎడమ వైపున పార్వతీదేవి ఉన్నారు.



గౌరమ్మ గుడి



మల్లయ్యకొండ ఆలయం నుంచి ఉత్తరం దిక్కులో అర కిలోమీటరు ఎగువన గౌరమ్మ ఆలయం ఉంది. సంతానం లేని మహిళలు, వివాహం కాని స్త్రీలు కోనేటిలో స్నానమాచరించి తడి బట్టలతో అమ్మవారికి వరపడతారు. గుడి దగ్గర ఉన్న చెట్లకు ముడుపులు(ఊయలలు) కట్టి, చిన్న రాళ్లను ఒకదానిపై ఒకటి పేర్చి కోర్కెలు తీరాలని మొక్కుకుంటారు. ఆలయంకు ఎగువన గౌరమ్మ కుప్ప వ్యూ పాయింట్ ఉంది. ఇక్కడి నుంచి చూస్తే సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుమల కొండలు కనపడుతాయి.



మూడు కొండల మల్లన్న మీద అన్నమయ్య జిల్లావాసులకు అనంతమైన గురి. ఏ కష్టం వచ్చినా మల్లన్నకు మొక్కుకుంటే చాలు అనే నమ్మకం. తంబళ్లపల్లె సమీపంలోని సాధు, ఇనుము, మల్లయ్యకొండలపై వెలసిన ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తుంటారు. ఈ శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు సిద్ధమవుతున్నాయి.

కొండకింద దేవుడు

మల్లయ్యకొండ కింద నేలమల్లేశ్వర స్వామి ఆలయం ఉంది. కొండ పైకి రోడ్డు సౌకర్యం లేనప్పుడు కాలినడకన కొండ ఎక్కలేని భక్తులు నేల మల్లేశ్వరస్వామిని దర్శించుకుని చేసేవారు. ఈ ప్రాంతంలోని మద్దాభక్తుని బావి వద్ద ఆంజనేయ స్వామి, వినాయకుడి ఆలయాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఆలయాల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి.



ఏనుగు మల్లమ్మకు తొలి పూజ



మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఒక కిలో మీటరు దిగువన మల్లికార్జున స్వామి సోదరిగా భావించే ఏనుగుమల్లమ్మ ఆలయం ఉంది. అందంగా లేదని చెల్లెలు ఏనుగు మల్లమ్మను శివయ్య పెళ్లిచూపులకు తన వెంట రావద్దని చెప్పాడంతో ఆమె అలిగి ఇక్కడ శిలగా మారిందని ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. చెల్లెలిని శాంతపరచడానికి తొలి పూజ నీకే దక్కుతుందని శివుడు ఆదేశించాడని చెప్పుకుంటారు.

గౌరీ నోము

కార్తీకమాసంలో భక్తులు ఆలయంలో ఒక రోజు రాత్రి నిద్ర చేసి, వేకువనే కోనేరులో స్నానమాచరించి సూర్యోదయాన స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. కార్తీక సోమవారాల్లో వేల మంది ఉపవాసంతో కొండకు వెళ్లి కేదారేశ్వర గౌరీ నోములు నోచుకుంటారు. మహిళలు ఆలయ ధ్వజ స్తంభం వద్ద నేతి దీపాలు వెలిగించి కోర్కెలు నెరవేరాలని వేడుకుంటారు.

సూర్యకిరణాభిషేకం

దక్షిణాయణంలో సూర్యోదయాన ఆలయ గర్భగుడిలో ఉన్న స్వామి వారి శివలింగాన్ని సూర్యకిరణాలు అభిషేకించడం విశేషం. ఉత్తరాయణంలో భ్రమరాంబ అమ్మవారి పాదాలను ఉదయ కిరణాలు స్పర్శిస్తాయి.


మహాశివరాత్రి ఉత్సవాలు

మల్లయ్యకొండలో మహాశివరాత్రి ఉత్సవాలను నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు వస్తారు. శివమాల ధరించినవారు కాలినడకన మల్లయ్యకొండ ఎక్కి స్వామి వారిని దర్శించుకుని ఇరుముడులు సమర్పిస్తారు. మద్దాభక్తునిబావి వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇలా వెళ్ళచ్చు...

- మల్లయ్యకొండ కింద నుంచి పైకి 8 కి.మీ మేర ఘాట్ రోడ్డు ఉంది. రాయచోటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆలయానికి రావాలంటే ముదివేడు క్రాస్‌కు వచ్చి అక్కడి నుంచి తంబళ్లపల్లెకు చేరుకోవచ్చు.
- కార్లు, ఇతర వాహనాలల్లో అయితే రెడ్డికోట క్రాస్ నుంచి కుక్కరాజుపల్లె, కోటకొండ మీదుగా తంబళ్లపల్లెకు చేరుకోవచ్చు. ఇక్కడి రాగిమాను కూడలి నుంచి కొండ పైకి ప్రయివేటు వాహనాలు అందుబాటులో ఉంటాయి.
- ప్రతి సోమవారం మల్లయ్యకొండకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి.
- మహాశివరాత్రి పర్వదినాల్లో రాయచోటి, మదనపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దమండ్యం నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తాయి.





మల్లయ్యకొండ పై ఇవి చూడండి..

- మల్లయ్యకొండపైన సహజసిద్ధంగా ఏర్పడిన నిచ్చెనకొండ, ఎలుకతీర్థం, భగీరథీ కొలను(కోనేరు), అంతర గంగ, అన్నబేధి అనే పంచ తీర్థములు ఉన్నాయి. వీటిలో ఊరిన నీటిని స్వామివారి అర్చనలు, అభిషేకానికి ఉపయోగిస్తారు.
- నిచ్చెనకొండలో ఉన్న రాతిలో ఎంతటి కరువులో నైనా నీరు ఉండటం విశేషం. భక్తులు నిచ్చెన ద్వారా ఎక్కి అందులోని నీటిని తీర్థంగా సేవిస్తారు.
- వీరన్న గెవి, చాకలివాని బావి, ఎర్రబావి(ఊటచలం) కూడా దర్శించవలసిన ప్రదేశాలు కొండపై ఉన్నాయి. సాధుకొండలోని ఓ గెవిలోంచి ఎల్లెలుకలను తోడుగా పెట్టుకుని సొరంగ మార్గం ద్వారా మల్లయ్యకొండలోని వీరన్నగెవి గుండా స్వామి బయటకు వచ్చాడని జనం నమ్మకం

ఎంపీపీ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాసం

- ఎంపీడీవోకు ఎంపీటీసీ సభ్యుల ప్రతిపాదన

బి.కొత్తకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ గురువారం మండలంలోని 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవో శంకరయ్యకు వినతిపత్రం సమర్పించారు. 2021 సెప్టెంబరు 21న ప్రమాణస్వీకారం చేసిన తాము ఏకగ్రీవంగా ఆమెను ఎంపీపీగా ఎన్నుకున్నామని, అయితే ప్రస్తుతం ఆమె పనితీరు వల్ల ఆమెపై విశ్వాసం కోల్పోయామని, ఆమెపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్నామని ఆ పత్రంలో పేర్కొన్నారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా వారిలో ఖాదర్‌వల్లి (తుమ్మణంగుట్ట), రాధ (సూరపు వారిపల్లె), రామసుబ్బారెడ్డి (నాయనబావి), ఎల్లప్ప (బీరంగి), సుబ్బయ్య (బడికాయల పల్లి), గౌతమి (మొటుకుపల్లి), ఈశ్వరమ్మ (కోటావూరు), విమలమ్మ (గోళ్లపల్లి), బాలక్రిష్ణ (గట్టు) సంతకాలు చేశారు. దీనిపై ఎంపీడీవో శంకరయ్య మాట్లాడుతూ అవిశ్వాస తీర్మాన ప్రతిపాదనను జిల్లా పరిషత్ సీఈవోకు పంపుతామని, పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా మండలంలోని 11 మంది వైసీపీ తరఫున ఏకగ్రీవం అయినవారే. అయితే ఎంపీపీ లక్ష్మీనరసమ్మ వైసీపీతో అంటీముట్టనట్లు ఉన్న ఓ నాయకుడి కనుసన్నల్లో ఉన్నందున ఆమెపై అవిశ్వాసానికి తెరలేపినట్లు మండలంలో చర్చ జరుగుతోంది.



ఎంపీడీవో శంకరయ్యకు ప్రతిపాదిత పత్రం ఇస్తున్న ఎంపీటీసీలు

ప్రశాంతంగా బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

రాయచోటిటిటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషర్ వాసుబాబు, మెప్మా అధికారి అబ్బాస్ అలీఖాన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు రాయచోటి పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్, కెనరా, ఇండియన్ ఓవర్సీస్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, డీసీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులతో కలిసి మొత్తం 17 బ్యాంకుల అధికారులు హాజరు కాగా రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 1458 మంది లబ్ధిదారులకు గానూ 1252 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి స్వీకరించారు. దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు తెలియజేశారు.



బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు

టీడీపీ నాయకుల కుటుంబాలకు ఐదేళ్లుగా తాగునీరు నిలిపివేత

- కూటమి ప్రభుత్వం వచ్చినా మారని వైసీపీ పెత్తనం
- తాగునీరు అందించాలని బాధితుల వేడుకోలు

నిమ్మనపల్లి ఫిబ్రవరి 20(ఆంధజ్యోతి): టీడీపీ కుటుంబాలకు దాదాపు ఐదేళ్లుగా గ్రామ పంచాయతి వేయించిన బోరు నుంచి తాగునీరు ఇవ్వకుండా వైసీపీ నాయకులు వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా తమకు తాగునీరు అందడంలేదని ఇలా అయితే తమ బతుకులు ఎలామారుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నిమ్మనపల్లె మండలంలోని వెగంవారిపల్లి పంచాయతి ముతకనవారిపల్లిలో తొమ్మిది కుంటుంబాల వారు జీవిస్తున్నారు. అయితే ఇందులో రెండు కుటుంబాలు మాత్రం టీడీపీ మద్దతుదారులు కాగా మిగిలిన 7కుంటుబాలు వైసీపీకి చెందిన వారు. ఐదేళ్ల క్రితం పంచాయతికి సంబంధించి తాగునీటి కోసం బోరు వేయించారు. అయితే ముతకనవారిపల్లిలో ఉండే వైసీపీ మద్దతుదారులు టీడీపీ నాయకుల కుంటుంబాలను తాగునీటిని పట్టుకోనివ్వకుండా అడ్డుకొని మీకు దిక్కున్నచోట చెప్పుకోండి అని దౌర్జన్యం చేసి బోరుకు తాళం వేసి వారి వద్దే పెట్టుకొన్నారు. దీంతో చేసేదేమి లేక పలు మార్లు పంచాయతి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో టీడీపీ నాయకులు శివగంగిరెడ్డి నారాయణరెడ్డి ఐదేళ్ల పాటు తయ సొంత వ్యయసాయ బోరు నుంచి పైపు లైన్ వేయించుకొని జీవనం సాగించారు. గతంలో కూడా టీడీపీ నాయకులు తాగునీరు ఇవ్వలేదని పలు మార్లు పంచాయతి కార్యదర్శికి పిర్యాదు చేయగా మొక్కుబడిగా గ్రామానికి వచ్చి తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపి వెళ్లిపోయారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ముతకనవారిపల్లిలో టీడీపీ కుటుంబాలకు తాగునీరు ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై ప్రస్తుతం ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డికి బాధిత కుటుంబాలు పిర్యాదు చేయగా ఆయన గ్రామంలోకి వెళ్లగా అక్కడ గ్రామస్థులు పనులకు వెళ్లినట్లు తెలిపారు. రెండు రోజుల్లో తాగునీరు ఇవ్వకుండా నిలుపుదల చేసినందుకు పూర్తి విచారణ చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



ముతకనవారిపల్లిలో బోరుకు తాళం వేసిన దృశ్యం

సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎస్.వి.సుబ్రమణ్యంశాస్త్రి, టి.గంగరాజు, ఉత్తన్న అనే వారు మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాలతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు జనవరి 16వ తేదీ సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ సచివాలయంలో విచారణ చేశారు. రూ.45,33,124 నిధులు దుర్వినియోగం అయినట్లు డీఎల్‌పీవో నివేదిక ఇచ్చారు. దీనిపై సర్పంచ్‌ను వివరణ కోరినా స్పందించకపోవడం, బిల్లులు, ఎం.బుక్కులు సమర్పించకపోవడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీ పరిపాలన, సమస్యల పరిష్కారానికి నిధులు ఖర్చు చేసే అధికారం, ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఇచ్చినట్లు చెప్పారు.

గుండాలకోనకు ఆర్టీసీ బస్సు ట్రయల్ రన్

చిట్వేలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుణ్యక్షేత్రమైన గుండాలకోన కర్కటేశ్వరుడి సన్నిధికి ఇటీవల రహదారి పనులు పూర్తి కావడంతో గురువారం ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సుతో ట్రైల్ రన్ నిర్వహించారు. ట్రైల్ విజయవంతం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మార్గానికి చాలాకాలంగా సరైన రవాణా సదుపాయం లేక కాలినడకన, ట్రాక్టర్లు, ఆటోల్లో భక్తులు వెళ్లి మొక్కులు తీర్చుకునేవారు.

ఈ సందర్భంగా గుండాలకోన చైర్మన్ బుంగటావుల రాజశేఖర్ మాట్లాడుతూ శివరాత్రికి గుండాలకోనలో ప్రత్యేక పూజలు, ప్రత్యేక అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శివరాత్రికి పెద్దూరు నుంచి గుండాలకోనకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తిరుపతిలో ఘోర రోడ్డు ప్రమాదం

- టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో గాలివీడు యువకుడి మృతి
- బోరెడ్డిగారిపల్లెలో విషాదఛాయలు

గాలివీడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాలివీడు మండలం బోరెడ్డి గారిపల్లె పంచాయతీ కస్బాకు చెందిన యువకుడు మృతి చెందాడు. దీంతో స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పూర్తి వివరాలిలా..

గాలివీడు మండలం, బోరెడ్డి గారిపల్లెకు చెందిన షేక్.ఇదయతుల్లా, రషీద దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు షాకీర్‌బాషా (21) తిరుపతిలోని విద్యానికేతన్ కళాశాలలో బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి తోటి విద్యార్థినితో కలిసి ద్విచక్రవాహనంలో వివాహానికి వెళ్లి వస్తుండగా నాయుడుపేట-పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో గల ఉమెన్ స్టే హోం వద్ద వారిని టిప్పర్ ఢీకొంది. దీంతో షాకీర్‌బాషాతో పాటు గుర్తు తెలియని మరో విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా గురువారం ఉదయం పోలీసులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన వెంటనే హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకుని లబోదిబోమన్నారు. మృతదేహాన్ని గురువారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చారు. చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం చేసి తమకు చేదోడు వాదోడుగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. చిన్నవయసులోనే నిండు నూరేళ్లు నిండిపోయాయా అంటూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలతో బోరెడ్డి గారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతిచెందిన యువకుడు షాకీర్‌బాషా, షాకీర్‌బాషా (ఫైల్‌ఫొటో)

రాయచోటి సబ్‌జైలు తనిఖీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనలతో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ రాయచోటి సబ్‌జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని ఖైదీలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యత గురించి ఖైదీలకు తెలియజేశారు. అలాగే జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ సిస్టం గురించి ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై అవగాహన కల్పించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయసేవా సమితిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఖైదీలు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్

భార్య కాపురానికి రాలేదని యువకుడు ఆత్మహత్యాయత్నం

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రాలేదని ఓ యువకు డు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలం సొన్నువారిపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బూర్లపల్లె పంచాయతీ సొన్నువారి పల్లె కు చెందిన వెంకట్రమణ కుమారుడు సోమశేఖర్ (40) అనే యువకుడు ఇదే గ్రామానికి చెందిన డేరంగుల ఓబులేసు కుమార్తె గాయత్రి ని వివాహం చేసుకున్నాడు. కాగా భార్యభర్తలు తరచు గొడవ పడుతుండే వారు. సోమశేఖర్ తాగుడుకు బానిసై తరచు భార్యను వేదిస్తుండే వాడని ఇటీవల సోమశేఖర్‌పై భార్య గాయత్రి పీటీఎం పోలీసులకు పిర్యాదు చేయడంతో వారు మందలించి పంపించారు. అయితే గురువారం ఉదయం సోమశేఖర్ అతిగా మద్యం తాగి భార్య గాయత్రితో గొడవ పడి బహిర్భూమికి వెళ్లి గొంతుకోసుకున్నాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు.



ఘటనలో తీవ్రంగా గాయపడిన సోమశేఖర్

చలికి వణుకుతూ... ఎండకు ఎండాల్సిందేనా..!

- వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు
- రైతులకు తప్పని అగచాట్లు

ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



పులివెందుల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు అన్నీ కష్టాలే.. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా కష్టాలు మాకు తప్పవంటూ నిందిస్తున్నారు. ఇటీవల వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళలను మార్పు చేశారు. మొన్నటి వరకు చలికాలంలో తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 వరకు అందించారు. ఇపుడు ఉదయం 8.15 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు 9గంటల పాటు పూర్తిగా పగటి పూట విద్యుత్ అందిస్తున్నారు. ఈ విద్యుత్ వేళలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం చలికి వణుకుతూ పొలాలకు వద్దకు వెళాల్సి వచ్చేదని... ఇప్పుడు మండుటెండలకు మాడిపోతూ పంటలకు నీళ్లు పారకట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులకు వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళల్లో ప్రభుత్వం మార్పు చేసింది. 15రోజుల క్రితం వరకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌ను అందిస్తూ వచ్చేవారు. ప్రస్తుతం ఉదయం 8.15 నుంచి సాయంత్రం 5.15 వరకు విద్యుత్ అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రస్తుతం బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ, కొర్ర, నువ్వులు, టమోట, మిరప తదితర పంటలకు నీటి తడులు అందించాలంటే పూర్తిగా ఎండలోనే గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వ ద్వారా ఆ పంటకు నీరు అందించాలంటే కయ్యల రూపంలో నీటితడి అందించాల్సిందే. కాల్వ నుంచి కయ్యలోకి నీరు మళ్లించినపుడు ఆ కయ్య పది నిమిషాలకో పదైదు నిమిషాలకో నీరు పారుతుంది. వెంటనే పక్కనున్న మరో కయ్యకు నీటిని అందించాలి. ఇలా నీటి తడిని అందించాలంటే పూర్తిగా ఎండలోనే వుండాల్సి వస్తుందంటున్నారు. చలికాలం ఈ పద్ధతి పాటించి ఉంటే బాగుండేదని.. ఎండాకాలం ప్రారంభమవుతున్న సమయంలో ఇలా విద్యుత్ వేళలు మార్చడం ఇబ్బంది పెట్టడమేనని అంటున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి విద్యుత్ వేళల్లో మార్పు చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా, విద్యుత్ వేళల మార్పులపై ఏడీఈ స్థాయి అధికారిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వం చెప్పినట్లు విద్యుత్ వేళల్లో మార్పు చేశామని తెలిపారు. తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ వ్యవసాయానికి అందిస్తే రైతులకు, పంటలకు అనుకూలంగా ఉండేదన్నారు.

వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం

- మాల కార్పొరేషన్ చైర్మన్ ఆగ్రహం



ఎస్సీ కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మాల కార్పొరేషన్ చైర్మన్

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందని మాల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొంకరి కమలమ్మ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లేష్, అనిత దీప్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మిలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మాల యువత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భూమి కొనుగోలు పథకం కార్యక్రమం అమలు, ప్రస్తుత పనితీరు గురించి, లబ్ధిదారుల వివరాలను ఆయన కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా హరిజన అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా ఇచ్చిన 3505 ఎకరాల భూమికి సంబంధించి సమీక్ష నిర్వహించారు.

జిల్లాలో నాలుగు దశాబ్దాల క్రితం షెడ్యూల్డు కులా ల వారికి కేటాయించిన షాపింగ్ కాంప్లెక్సులు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల నిర్వహణపై ఆరాతీశారు. దీంతో పాటు కార్పొరేషన్ కార్యక్రమాలు, ఆస్తులపై సమగ్ర నివేదిక రూపొందంచాలని కార్యనిర్వాహక సంచాలకులను రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో కార్పొరేషన్‌కు జవసత్వాలను నిం పేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో మాల యువత ఆర్థికాభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండికోట నుంచి నీరు విడుదల



మెయిన్‌కెనాల్ నుంచి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి రైతుల అవసరాల కోసం 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ ద్వారా కమలాపురం రైతుల అవసరాల దృష్ట్యా ఈ నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 24.245 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేదన్నారు. మిగిలిన ప్రాజెక్టులకు నీరు వదలడం లేదని ఈఈ తెలిపారు.

అక్రమంగా వేపచెట్ల నరికివేత



పోలీసు స్టేషన్‌లో ఉంచిన వేపదుంగల లారీ

అట్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెడ్డిపల్లె పొలాల సమీపంలో సుమారు 40 వేపచెట్లను అనుమతి లేకుండా నరికినట్లు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. ఓల్టా చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా వేప చెట్లను కోత మిషన్ల ద్వారా నరికి దుంగలను లారీకి లోడు చేస్తుండగా రెవెన్యూ సిబ్బందితో వెళ్లి దుంగల లారీని స్వాధీనం చేసుకుని ఎస్ఐ రామక్రిష్ణకు అప్పజెప్పినట్లు తెలిపారు. ఎవరైనా ఓల్టా చట్టాన్ని అతిక్రమించి చెట్లను నరికితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్థానిక వీఆర్వో నాని, వీఆర్ఏ క్రిష్ణ ఉన్నారు.

గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి



లింగాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం మీదపడడంతో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకెళితే... లింగాల గ్రామానికి చెందిన అలవలపాటి శోభ (40) శనివారం తమ పొలం లో సాగుచేసిన శనగ పంటను యంత్రం ద్వారా నూర్పిడిచేసే ప్రక్రి య పూర్తిచేసి.. ఆ తర్వాత పక్కపొలం రైతు శనగ పంట నూర్పిడి కోసం కూలీలు తక్కువగా ఉండడంతో అక్కడకు వెళ్లింది. యంత్రం పనిచేస్తున్న సమయంలో శనగలు బయటకు వచ్చే గొట్టం విద్యుత్ స్తంభం మీద పడటంతో విరిగి అక్కడే ఉన్న శోభ మీదపడడంతో కాలువిరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం సరిగా లేక మనస్తాపం చెందిన పద్మనాభరెడ్డి (58) అనే వృద్ధుడు గురువారం మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలోని కాలనీ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన పద్మనాభరెడ్డి కొద్దిరోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ రోగం నయం కాకపోవడంతో గురువారం ఉదయం వలసపల్లె కాలనీలోని ఖాళీ స్థలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి భార్య తోపాటు అమెరికాలో చదువుతున్న కుమారుడు యశ్వంత్‌రెడ్డి, కుమార్తె భవ్యశ్రీ ఉన్నారు. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కురబలకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ బుడ్డారెడ్డిగారిపల్లె సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందాడు. మృతుడిని గుర్తుపట్టడానికి వీల్లేకుండా శరీరం ఛిద్రమైంది. ఈ మార్గాన వెళ్లే గ్రామస్తులు గమనించి కుటుంబీకులకు, కదిరి రైల్వే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడికి గాయాలు

ముద్దనూరు ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చింతకుంట సమీపంలో గురువారం ప్యాసింజర్ రైలు నుంచి ప్రమాద వశాత్తు కింద పడటంతో అర్జున్ (29)అనే యువకుడికి గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వాసి అర్జున్ వెళుతున్న ప్యాసింజర్ రైలు నుంచి జారి కిందపడ్డారు. పొలాల్లో పనిచేస్తున్న వారు గుర్తించి 108 ద్వారా క్షతగాత్రుడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తాం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం అమరాతి నుంచి గ్రూపు-2, ఇంటర్ పరీక్షలు, పి-4 సర్వే, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాలపై రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా వీసీ ద్వారా రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ గ్రూపు-2 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి ప్రగతి అనే నినాదంతో నిర్వహించే పి-4 సర్వే వచ్చే ఉగాది లోపు ప్లానింగ్ సచివాలయాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అగ్రికల్చర్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఐవీఆర్ ద్వారా ప్రజల నుంచి ప్రజా స్పందనలు స్వీకరించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 158 సేవలు అందిస్తున్నామని... మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని వీటిపై మరింత దృష్టి సారించాలన్నారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీవో హాజరత్తయ్య, పంచాయతీరాజ్ అధికారి రాజ్యలక్ష్మి, డీఈఓ షంషుద్దీన్, ఏపీపీఎస్సీ అధికారులు, విద్యాశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బీఈడీ పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రార్ పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ పరిధిలో గల కళాశాలల్లో 1,3 సెమిస్టర్ల బీఈడీ పరీక్షలు గురువారం ప్రారంభయ్యాయి. ఉమ్మడి కడప జిల్లాలో 15 కేంద్రాలను ఏర్పాటు చేయగా 4713 మంది హాజరయ్యారు. పరీక్షలను విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచా ర్య కె.ఎ్ ఎ.వి.కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలో జరుగుతున్న ఎస్వీ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో 10 కేంద్రాల్లో, అన్నమయ్య జిల్లాలో ఐదు కేంద్రాల్లో తొలిరోజు 4713 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ), మధ్యాహ్నం 3వ సెమిస్టర్ వారికి పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పా రు. జిల్లా వ్యాప్తంగా రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నారని, అలాగే ప్రతి కేంద్రానికి అబ్జర్వర్‌ను నియమించామని తెలిపారు.

తిరుపతి టాస్క్‌ఫోర్సు అదుపులో ప్రొద్దుటూరు వ్యక్తులు?

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం ప్రొద్దుటూరులోని దస్తగిరి పేటకు చెందిన ఆరుగురు వ్యక్తులను స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు తిరుపతికి తీసుకెళ్లి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరిలో ముగ్గురు మైనర్ పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల హైదరాబాదులో డ్రగ్స్ కేసులో ప్రొద్దుటూరు దస్తగిరిపేటకు చెందిన షేక్ మహ్మద్ హనీఫ్, చాంద్‌పీర్ అనే ఇద్దరు వ్యక్తులు అరెస్టు కాగా చెంచల్‌గూడా జైలులో వున్నారు. వీరిని కస్టడీకి తీసుకొని విచారించే క్రమంలో ప్రొద్దుటూరులో మరికొంతమంది డ్రగ్స్ రాకెట్‌లో వున్నట్లు సమాచారం రావడంతో స్పెషల్ టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం సాయంత్రం దస్తగిరిపేటలోని ఓ ప్రైవేటు స్కూలు సమీపంలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. కవ్వా అనే అడ్డ పేరుగల వ్యక్తి గురించి కొందరు కొత్త వ్యక్తులు ఆ ప్రాంతంలో ఆరా తీసినట్లు కూడా స్థానికులు నిర్ధారిస్తున్నారు. అయితే స్థానికంగా ప్రొద్దుటూరు పోలీసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకనే వారిని తీసుకెళ్లారా లేదా వారికి సమాచారం ఇచ్చి పట్టుకుపోయారా అనేది పోలీసులు ధ్రువీకరించడం లేదు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు పట్టివేత

సిద్దవటం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు డేగనవారిపల్లెకు చెందిన రైతు 100 డయల్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం ఉదయం డేగనవారిపల్లె గ్రామ సమీపాన 3 ఇసుక ట్రాక్టర్లను, బండికనుమపై 2 ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నామని ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు శివప్రసాద్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం పంచాయతీలో అవకతవకలు, అవినీతిపై విచారణ



పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌పీవో తిమ్మక్క

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో చోటు చేసుకున్న అవకతవకలు, అప్పటి కార్యదర్శి గురుమోహన్ అవినీతిపై వచ్చిన ఆరోపణలపైన డీఎల్‌పీవో తిమ్మక్క గురువారం సమగ్ర విచారణ చేపట్టారు. 2019-23 మధ్య కాలంలో గోపవరం కార్యదర్శి గురుమోహన్ అవినీతికి పాల్పడ్డాడని, అప్పటి మాజీ వార్డు సభ్యుడు మార్తల సుబ్బారెడ్డి, డీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. జడ్పీసీఈవో ఆదేశాల మేరకు డీఎల్‌పీవో తిమ్మక్క సుమారు మూడు నెలల కిందట విచారించి నివేదిక అందించారు. అయితే ఆ నివేదిక సక్రమంగా లేదని, నిజాలు నిగ్గు తేలలేదని ఫిర్యాది డీపీవోను ఆశ్రయించారు. దీంతో ఫిర్యాదిదారుని పిలిపించి విచారణ చేపట్టి సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు డీఎల్‌పీవో గోపవరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదిదారుడు సుబ్బారెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. గోపవరం-కొత్తపల్లె పంచాయతీ పరిధిల్లో లేఅవుట్ అప్రూవల్‌లో అక్రమాలు జరిగాయని, చెన్నకేశవ అనే వ్యక్తి దొంగ సర్టిఫికెట్‌తో రూ.15 వేలు జీతంతో సుమారు రెండున్నర సంవత్సరంపాటు విధులు నిర్వహించి పంచాయతీ ఆదాయానికి గండికొట్టారని, గ్రామ పంచాయతీలో బినామీ పేర్లతో అక్రమ వసూళ్లు చేశారని, అప్పటి కార్యదర్శి గురుమోహన్ అవినీతి సంపాదనతో ఆస్తులు కూడబెట్టారని డీఎల్‌పీవోకు వివరించారు. వీటిపై లిఖితపూర్వక ఫిర్యాదు అందిస్తూ ఆధారాలు సమర్పించాలని ఆమె కోరగా ఇదివరకే పలుమార్లు ఫిర్యాదు చేశానని, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చాలని ఫిర్యాదిదారుడు పట్టుబట్టారు. దీంతో కొన్ని రికార్డులు అందుబాటులో లేవని, ఉన్నవాటిల్లో అధికారులు పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో సాగు, తాగునీరు అందిస్తాం : ఎమ్మెల్యే ఆది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వామికొండ రిజర్వాయర్ పరిధిలో ఉన్న రైతులకు వంద రోజుల్లో సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. జీఎన్ఎస్ఎస్‌లో అంతర్భాగమైన వామికొండ రిజర్వాయర్ కింద అసంపూర్తిగా ఉన్న కాలువపనులు, భూసేకరణ తదితర అంశాలపై మాదన్నగారిపల్లె వద్ద గురువారం ఎమ్మెల్యే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయకట్టు పరిధిలోని ముద్దనూరు మండలానికి చెందిన ఉప్పలూరు, కొలవలి, ఒంటిగారిపల్లె, పెనికలపాడు, ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, కర్చుకుంటపల్లె, దండుపల్లె, వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దనపాడు, వీఎన్‌పల్లె మండలంలోని ఉరుటూరు, వెల్లుర్తి గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయర్‌లోని ఊటలు వస్తుండటంతో పంటలు పండటం లేదని ఒంటిగారిపల్లెకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ తీసేందుకు తీసుకున్న భూములకు ఒక్కోచోట ఒక్కవిధంగా నష్టపరిహారం ఇచ్చారని అందరికీ సమానంగా ఇవ్వాలని రైతులు కోరారు. మాదన్న గారిపల్లెకు చెందిన రైతులు మాట్లాడుతూ గతంలో రూ.6లక్షలు ఇచ్చారని ప్రస్తుతం రూ.22లక్షలు ధర పలుకుతోందని ఆప్రకారం ధర చెల్లిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మెయిన్ కాలువ ద్వారా నీరందడంలేదని లఫ్ట్ ద్వారా అయితే తమ పొలాలకు, చెరువులకు అందుతాయని వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దన్నపాడు రైతులు తెలిపారు. కాగా, వామికొండసాగర్‌కు 1.65 టీఎంసీల సామర్థ్యం వుందని, కుడి కాలువ కింద ఊప్పలూరు తదితర గ్రామాల్లోని 2వేల ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, వలసపల్లె, తుమ్మలపల్లె, పెద్దనపాడు, వీఎన్‌పల్లె మండలంలోని ఉరుటూరు, వెల్లుర్తి గ్రామాలకు మొత్తం 8వేల ఎకరాలకు నీరందించవచ్చని ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్య, ఏఈ సురేష్ రెడ్డిలు ఎమ్మెల్యేకి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే జూన్ 15నాటికి కాలువ పనులన్నీ పూర్తిచేసి రిజర్వాయర్ పరిధిలోని 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రైతులు సహకరించాలన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ వామికొండసాగర్ కింద ఉండే రైతులకు న్యాయం చేసేందుకు గతంలో కూడా పోరాడామని.. ఇప్పుడు మన ప్రభుత్వంవచ్చిందని అందరికీ న్యాయం చేస్తామన్నారు.

న్యాయమైన రేటును కల్పిస్తాం : జేసీ



రహదారి విస్తరణకు సంబంధించి పత్రాలను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి-రాయచోటి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు భూమి మార్కెట్ విలువతో పాటు న్యాయమైన రేటు కల్పించేలా అవార్డు ప్రకటిస్తామని జాయింట్ కలెక్టర్ అది తిసింగ్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో జాతీయ రహదారికి భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అన్యాయం జరగకుండా రేటును కల్పిస్తామన్నారు. రైతులు, ప్లాట్లు యజమానులకు ప్రభుత్వ నిబంధనల మేరకే నష్టపరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులకు పరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే విజయం మీ సొంతం

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి చదివితే విజయం మీ సొంతమవుతుందని ప్రభుత్వ హోమియోపతి డాక్టర్ షాకిర్‌హుసేన్ తెలిపారు. గురువారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పరీక్షల పట్ల ఆందోళన తొలగించేందుకు హోమియోపతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమియోపతి మందులు పంపిణీ చేశారు.

'మాతృభాషాభివృద్ధికి మార్పులు తీసుకురావాలి'

కడప కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మాతృభాష తెలుగు అభివృద్ధికి అనేక మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మూలమల్లికార్జున రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన మాతృభాషకు కొన్నివేల సంవత్సరాల చరిత్ర కలదన్నారు. ఈ సుదీర్ఘకాలం ఎన్నో ఆటుపోట్లకు ఒత్తిళ్లకు గురై ఎదురీదుతోందన్నారు. మన రాష్ట్రంలో 1966లోనే తెలుగును అధికార భాషగా చేసినప్పటికీ నేటి వరకు ప్రభుత్వ కార్యకలాపాలలన్నీ ఆంగ్ల భాషలోనే కొనసాగుతున్నాయన్నారు.మన మాతృభాష దినోత్సవాన్ని జాతీయ స్థాయిలో నిర్వహించాలన్నారు. కావున పాఠశాలు, కళాశాలల్లో మాతృభాషాభివృద్ధికి పలు మార్పులు తీసుకురావాలని ఆయన కోరారు.

'బీసీలకు 50 శాతం రాయితీ వర్తింపజేయాలి'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విడుదల చేసిన బీసీ కార్పొరేషన్ రుణాల్లో బీసీలకు 50 శాతం రాయితీ ఇవ్వాలని బీసీ మహాసభ జాతీయ కన్వీనరు అవ్వారు మల్లిఖార్జున గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈబీసీలకు 50శాతంతో కూడిన రాయితీ రుణాలు ఇస్తూ బీసీలకు మాత్రం 40శాతం మంజూరు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. పునరాలోచించి బీసీలకు 50శాతం ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు.

'దూదేకుల సంక్షేమానికి తోడ్పడండి'

కడప క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : దూదేకుల సంక్షేమానికి తోడ్పడాలని ఆ సంఘం అధ్యక్షుడు ఖాదరయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎర్రముక్కపల్లెలోని దూదేకుల భవనంలో నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎస్ఐ వి.ఖాదరయ్య నూతన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. రిటైర్డ్ ఎంపీడీవో వెంకటప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సుభాన్, టీచర్ అజ్మతుల్లా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్తాన్ని పీల్చేస్తున్నాయి..

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుంది కడప నగర పరిస్థితి.. పేరుకుపోయిన చెత్తాచెదారం.. కాలువల్లో కదలని మురుగు.. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు.. తూతూ మంత్రంగా పారిశుధ్య చర్యలు దోమలకు నిలయాలుగా మారాయి.. ఇన్ని సౌకర్యాలు ఉండటంతో అవి దినదినాభివృద్ధి చెందుతూ జనం రక్తం పీల్చేస్తున్నాయి. ఇంటాబయటా దోమలు చుట్టుముట్టి కంటికి కునుకు లేకుండా చేస్తుండటంతో ఈ నగరానికి దిక్కెవ్వరు అంటూ నగర ప్రజలు నిట్టూర్పు విడుస్తున్నారు.







రామరాజుపల్లె వద్ద ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు నీరు.. జమ్ము, కంపచెట్లు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దోమ పరిమాణంలో చిన్నదే అయిన కుట్టిందంటే ఎంతటివారైనా ఆసుపత్రి పాలవ్వాల్సిందే. అధ్వానంగా మురుగుకాల్వలు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు, ముందుకు కదలని మురుగు వెరసి.. కడప నగరంలో దోమల వ్యాప్తికి ప్రధాన కారణమవుతున్నాయి. చీకటి పడితే చాలు నగరవాసులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఇంటి తలుపులకు మెస్‌లు ఉన్నా ఏదో ఒకరకంగా లోపలికి చొరబడి దాడిచేస్తున్నాయి. ఇక ఆరుబయట ఒక్క క్షణం ఉండలేని పరిస్థితి. ఇప్పటికే ఉక్కపోత మొదలైంది. అయినా దోమల వల్ల సాయంత్రం వేళ చల్లగాలికి బయట ఉండే పరిస్థితి లేకుండా పోయింది. దోమల నుంచి చిన్నారులు, వృద్ధులను కాపాడుకునేందుకు నగరవాసులు నానాతిప్పలు పడుతున్నారు. వీటి నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న తూతూమంత్ర చర్యలు వాటిపై ఎలాంటి ప్రభావం చూపడం లేదు. ఇక ఇళ్లలో దోమల నియంత్రణకు వాడే వివిధ రకాల చర్యలు అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీస్థలాలు సుమారు వేలకుపైగా ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. వ్యర్థాలు, మురుగునీరు చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమల లార్వాలు పెరగకుం డా మలాథియన్, ఆయిల్‌బాల్స్ స్ప్రేయింగ్, గంబూషియా చేపలు వేయడం వంటి చర్యలు కానరావడం లేదు. రోజుకు అక్కడక్కడా ఫాగింగ్ మాత్రం చేస్తూ మమ అనిపిస్తున్నారు.



ఇళ్ల చెంతన ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

అప్రమత్తం కావాలి

ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగు నీరు నిల్వ ఉన్నా వాటి యజమానులు పట్టిం చుకోవడం లేదు. వాటిని చదునుచేసి నీరు నిల్వ లేకుండా చేసుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉంది. ప్రధానంగా నగరు శివారు ప్రాంతాలైన రామరాజుపల్లె, ఆచారి కాలనీ, రామాంజనేయనగర్, సన్‌సిటీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో పాటు కంపచెట్లు, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరిగి స్థానిక ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించి ఖాళీస్థలాల యజమానులను హెచ్చరించాలి. అలాగే ఖాళీ స్థలాలకు పన్ను కూడా వసూలు చేయాలి. అయితే దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఖాళీ స్థలాల యజమానులు కూడా దీనిపై పట్టించుకోవడం లేదు. దీంతో ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు చేరి కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు ఆవాస కేంద్రాలుగా ఏర్పడ్డాయి.

పేరుకుపోతున్న చెత్త

క్లాప్ వాహనాలు లేకపోవడంతో ఇంటింటా చెత్త సేకరణ అధ్వానంగా మారింది. వారానికి ఒకరోజు మాత్రమే చెత్త సేకరణకు మున్సిపల్ వాహనం రావడంతో ఇంట్లో పేరుకుపోయిన చెత్తను ప్రజలు వీదుల్లో వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే పారిశుధ్య కార్మికులు కూడా చెత్త తీసుకువచ్చి ఒకే ప్రాంతంలో వేయడంతో చెత్త దంపులు ఎక్కువయ్యాయి. ఇది కూడా దోమల విజృంభణకు ఒక కారణంగా స్థానికులు చెబుతున్నారు.

'నవోదయం'తో ప్రజల జీవితాల్లో ఉషోదయం

సికెదిన్నె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నవోదయం కార్యక్రమం ద్వారా ప్రజల జీవితాల్లో ఉషోదయం వెల్లివిరుస్తుందని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమం ద్వారా పోస్టర్లు ఆవిష్కరించి ప్రజలకు నవోదయం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాటుసారా ద్వారా కలిగే అనర్థాలను వివరించారు. నాటుసారా తాగితే ప్రాణాలకు ముప్పు అని తెలిపారు. నాటుసారా స్థావరాలు ఎక్కడైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాటుసారాను జిల్లాలో పూర్తిగా లేకుండా చేయాలని, అందుకు ప్రజలు పూర్తిగా సహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ గారూ... మా డివిజన్‌లో పర్యటించండి

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'కమిషనర్ గారూ... మా డివిజన్‌లో పర్యటించండి' అంటూ 27వ డివిజన్ ప్రజలు విన్నవిస్తున్నారు. గౌస్‌నగర్‌లోని మసీదు వీధిలో కాల్వలపైన అక్రమ కట్టడాలు, మెట్లు నిర్మించారన్నారు. మురికినీరు పోకుండా అడ్డుపడుతున్నాయని, పొరపాటున ఏదైనా అందులో పడితే తీసేందుకు చాలా కష్టంగా ఉందని తెలిపారు. అలాగే పారిశుధ్య కార్మికులు పూడిక సరిగా తీయడం లేదన్నారు. దీంతో మురికినీరు రోడ్డుపై పారుతోందన్నారు. బైకులు, ఇతర వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో పాదచారులకు కూడా తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. కావున తమ డివిజన్‌లో పర్యటించి సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్కేనగర్‌లో 2025 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై వామపక్షాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఢిల్లీలో మోదీ వికసిత్ భారత్ అంటూ బూటకపు మాటలు చెబుతుంటే, రాష్ట్రంలో బాబు విలవిల ఆంధ్ర అటున్నారని ఎద్దేవా చేశారు. 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ వారం రోజుల్లో పెట్టబోతున్నారని, ఈ బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి, పంట కాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ విభజనచట్టంలో ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పక్క రాష్ట్రం ఒరిస్సాకు ఇస్తుంటే బాబు ఎన్డీఏ ప్రభుత్వాన్ని అడగలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. గండికోట, మైలవరం, చిత్రావతి, సర్వరాయసాగర్, వామికొండ, బ్రహ్మసాగర్, వెలుగొండ తదితర చిన్న, మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టు ద్వారా వంద టీఎంసీల నిల్వకు అవకాశం ఉన్నా పాలకుల నిర్లక్ష్యం కారణంగా నీరులేక విలవిలపోతున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, ప్రభుత్వ ఖర్చుల్లో కోతలు పెడుతోందన్నారు. సీపీఐ (ఎంఎల్‌లిబరేషన్) ఓబయ్య మాట్లాడుతూ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు ప్రతి బడ్జెట్‌లో కొంత తగ్గిస్తూ ఆ పథకాన్ని లేకుండా చేయాలని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఇదే జరిగితే పేదరికం మరింత పెరుగుతుందన్నారు. ఆర్ఎస్‌పీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ పెట్రోల్, గ్యాస్ ఉత్పత్తులపై సర్ చార్జీలను ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. సీపీఎం, సీపీఐ, ఆర్ఎస్‌పీ,ఫార్వర్డ్ బ్లాక్‌కార్యకర్తలు పాల్గొన్నారు.

సిసోడియాను కలిసిన కలెక్టర్



సిసోడియాకు పూల మొక్కను అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయ పునః ప్రారంభోత్సంలో పాల్గొని విజయవాడకు తిరుగు ప్రయాణంలో భాగంగా కడప స్టేట్‌గెస్ట్ హౌస్‌కు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (రెవెన్యూ) ఆర్పీ సిసోడియాను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మర్యాదపూరంకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయశ్రీ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య అధ్యాపకుడికి డాక్టరేట్



సుధాకర్‌రెడ్డి

సికెదిన్నె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడు మల్లికార్జునకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న మల్లికార్జునకు తెలంగాణా రాష్ట్రం హైదరాబాదులోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్‌ను ప్రదానం చేయడం జరిగిందన్నారు. మల్లికార్జున డాక్టర్ పి.ప్రసన్న పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకుగాను డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్‌ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, ఏవో రామసుబ్బారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

సింహాద్రిపురం రైతు సేవాకేంద్రంలో సిబ్బంది కొరత

సింహాద్రిపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సింహాద్రిపురం 1, 2 రైతు సేవాకేంద్రాల్లో సిబ్బంది కొరతతో రైతు విశిష్ట గుర్తింపు నమోదుకు రైతులు ఇక్కట్లకు గురౌతున్నారు. వ్యవసాయ అధికారులు ఈ నెల 20వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని ప్రకటనలు ఇస్తున్నారు. ఏవో శివమోహన్‌రెడ్డిని వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. త్వరలోనే రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

'కక్షసాధింపు చర్యలు మానుకోవాలి'

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలో జానెడు స్థలం లేని నిరాశ్రయులు కమ్యూనిస్టు పార్టీ ఆశ్రయంతో వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు బద్వేలు రెవెన్యూ యంత్రాంగం కక్షపూరితంగా వ్యవహరించడం అన్యాయమని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగదాసరి ఇమ్మానియేల్ కానగల మునెయ్య డిమాండ్ చేశారు. గురువారం డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాటట్లాడుతూ బద్వేల్‌లో దళితులు, మైనార్టీలైన పేదల గుడిసెలపై అగ్రవర్ణాలైన కబబ్జాకోర్లు చేసే కుట్రలకు మద్దతు పలుకుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి, దళితులైన పేదల గుడిసెలపై రెవెన్యూ అధికారులు కక్షసాధింపు చర్యలను మానుకోవాలని లేనిపక్షంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

రేపు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 20: వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ తగ్గ సరఫరా చేసేందుకు ఈనెల 22వ తేదీ శనివారం ఎల్ఐసీ ఉపకేంద్రంలో గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మారుస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి సేవ్యానాయక్ తెలిపారు. లోడ్ పెంచడంలో భాగంగా ఉపకేంద్రంలోని 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తీసి 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పెడుతున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయం పరిసర ప్రాంతాలైన, ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఎదురుగా ఉండే ప్రాంతాల్లో, ప్రకాష్‌నగర్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో తక్షణం నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డివినల్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు.

పైలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

లింగాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పైలేరియా వ్యాధిపై (బోధవ్యాధి) ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి సుభాషిణి అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో బోధ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఎంఎండీపీకి సంబంధించిన కిట్‌ను పంపిణీ చేశారు. తగు జాగ్రత్తలను వివరించారు.

ఆరోగ్యం కాపాడుకోండి

వేంపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):ప్రతి విద్యార్థి కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సూచించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 30 మంది విద్యార్థినులకు కళ్లద్దాలు అందించారు.



పొలతలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం

సికెదిన్నె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పొలతలలో మూడు ఫేజ్‌ల విద్యుత్తు సౌకర్యాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి గురువారం ప్రారంభించారు. పొలతలకు 24 గంటల విద్యుత్తు సరఫరా అందించేందుకు చింతకొమ్మదిన్నె మండలం గోర్లపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ నుంచి పొలతల పుణ్యక్షేత్రానికి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. దీంతో ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు శాఖ ఎస్ఈ రమణ, డీఈ హరిసేవా నాయక్, నాగరాజు, ఏడీఏ రామచంద్రారెడ్డి, ఏఈలు రమణ, వేణుగోపాల్, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, పెండ్లిమర్రికి చెందిన గంగిరెడ్డి, రాజారెడ్డి, విశ్వనాథరెడ్డి, రామనాథరెడ్డి, అయ్యవారురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రుణాలు మంజూరు చేయాలి: డీవైఎఫ్ఐ

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రుణాలు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు పేరుకు మాత్రమే ఉండేవన్నారు. నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయలేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం బీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరుకు నోటిఫికేషన్లు ఇచ్చిందన్నారు.ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నిరుద్యోగులకు రుణాలు మంజూరుకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కేవీపీని కలిసిన పులివెందుల కాంగ్రెస్ ఇన్‌చార్జి

వేంపల్లె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావును కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి కలిశారు. హైదారబాద్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పులివెందులలో కాంగ్రెస్ పార్టీ గురించి కాసేపు చర్చించినట్లు ధ్రువకుమార్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదాన్ని 'రా..రమ్మని'



తెలిసీ ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడం అంటే ఇదేనేమో...సాధారణంగా ద్విచక్రవాహనంపై ఇద్దరు లేదా ముగ్గురు ప్రయాణిస్తారు.. ట్రాఫిక్ పోలీసులు ముగ్గురు కనిపించినా ఆపేస్తారు. కానీ ఈ చిత్రంలో చూడండి... ఏకంగా ఆరుగురు ఎంత సంతోషంగా వెళుతున్నారో...!

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఎల్ఐసీ సిబ్బంది సమ్మె జయప్రదం

● నూతన నియామకాలు చేపట్టాల్సిందే
● ఎల్ఐసీ సిబ్బంది డిమాండ్



సమ్మెలో పాల్గొన్న ఎల్ఐసీ సిబ్బంది

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఎల్ఐసీ సిబ్బంది నిర్వహించిన సమ్మె విజయవంతమైంది. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా సిబ్బంది గంటపాటు సమ్మెకు దిగారు. వివిధ ఉద్యోగాల సంఘాల నేతలు, వారి సమస్యలను వివరించారు. బ్రాంచ్ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. మెజార్టీ సంఘానికి గుర్తింపు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లలో 15 వేల మంది ఎల్ఐసీ ఉద్యోగులు తగ్గారని, సంస్థకోసం, పాలసీదారుల కోసం నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. ఇన్సూరెన్స్ రంగం రూపురేఖలు మారిపోతున్న దశలో నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే ఉన్నత విద్యావంతులైన హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువతను నియమించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జవాబుదారీతనం లేని ఔట్‌సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలే పరిష్కారమన్నారు. దేశంలో ఉన్న 80 శాతం ఎల్ఐసీ సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ సంఘం ఆల్ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు పొందిన సంఘంగా హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. క్లాస్-1 ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు, క్లాస్-2 ప్రతినిధులు ఏజెంట్ల నేతలు సంఘీభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచి కార్యదర్శి నరసింహం, బ్రాంచి మేనేజర్ సుబ్బయ్య, క్రిష్టారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నరసింహులు, లియాఫి అధ్యక్షులు గురుశేఖర్, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కబ్జాపై కూటమి కొరడా

ఆక్రమిత స్థలాల్లో బోర్డులు ఏర్పాటు ● భూ కబ్జాలపై రెవెన్యూ అధికారుల ప్రత్యేక దృష్టి



గుంతపల్లె ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్‌ఫొటో)

బద్వేలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అడ్డు, అదుపు లేకుండా సాగిన భూ కబ్జాలపై కూటమి ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోంది. నకిలీ పట్టాల సృష్టికి పెట్టింది పేరైన బద్వేలులో శ్మశానం సైతం ఆక్రమణలకు గురయ్యాయని అప్పట్లో టీడీపీ నేతలు ఆరోపణలు గుప్పించేవారు. ఎన్నికల సమయంలో బద్వేలు వాసులకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కబ్జాలపై ప్రత్యేక అధికారులు దష్టిసారించారు. ఇదే తరుణంలో నియోజకవర్గ వ్యాప్తంగా భూ ఆక్రమణలపై దృష్టిపెట్టాలని ఆర్డీఓ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వివరాల్లోకెళితే...

నకిలీ పట్టాల సృష్టికి మూలమైన బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటికే అనేక చోట్ల కబ్జాలను గుర్తించారు. వాటిని ప్రభుత్వ స్థలాలుగా పేర్కొంటూ బోర్డులు నాటుతున్నారు. బద్వేలు పట్టణంలో ఇళ్ల స్థలాలు, నియోజకవర్గంలో భూములు ఆక్రమణకు గురయ్యాయి. నియోజకవర్గంలో వేల ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ఒక అంచనా ఉంది. టీడీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని నారా లోకేష్ బద్వేలు పర్యటనలో ప్రకటించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంపై దృష్టి పెట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆక్రమణలపై దృష్టిపెట్టాలని ఆర్డీఓ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చిన ఆక్రమణలు నేరుగా పరిశీలించి ప్రభుత్వ స్థలంగా గుర్తిస్తూ బోర్డులు నాటుతున్నారు. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బద్వేలు పట్టణంలోని చెన్నంపల్లె, ఎన్జీఓ కాలనీ, గోపవరం మండలాల్లో రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. రహదారులు, ఆక్రమిత స్థలాలను మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు గుర్తించారు. బి.కోడూరు మండలంలో భూ ఆక్రమణల వ్యవహారం బయట పడడంతో ఆర్డీఓ చంద్ర మోహన్ వెళ్లి పరిశీలించారు.



బద్వేలులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

ఆ మండలాల్లో నకిలీ పట్టాలు

బద్వేలు, బి.కోడూరు, పోరుమామిళ్ల, గోపవరం, కలసపాడు మండలాల్లో పెద్ద ఎత్తున సాగిన నకిలీ పట్టాల బాగోతం అధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. నకిలీ పట్టాలు గుర్తించి కబ్జాకు పాల్పడిన వారిపైన అధికారులు దృష్టిసారించే పనిలో ఉన్నారు. నకిలీ పట్టాలు సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే పరిస్థితులు కూడా కన్పిస్తున్నాయి. నకిలీ, డీకేటీ పట్టాలు, ఇళ్లపట్టాలు సృష్టించి కబ్జా చేసిన వారిలో ఇప్పుడు ఆందోళన మొదలైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ నియోజకవర్గ వ్యాప్తంగా భూ ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిసారించి స్థలాలను స్వాధీనం చేసుకుంటుండడంతో కబ్జాదారుల్లో దడ మొదలైంది.



బి.కోడూరులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ (ఫైల్‌ఫొటో)

రహదారి, ఆలయ ప్రాంగణం పరిశీలన

ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, రితేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు



పరిసరాల పరిశీలనలో చైర్మెన్ చంద్రశేఖర్ రెడ్డి, రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం రోజున వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు సౌకర్యం, ఆలయ ప్రాంగణం ఆలయ చైర్మెన్ చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితేష్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం లంకమల్ల అటవీ ప్రాంతంలో వెలసిన రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న వారు మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రహదారిని, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా కరపత్రాలను విడుదల చేసిన వారు మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన లంకమల రామలింగేశ్వరస్వామిని దర్శించుకుకోవడం సంతోషంగా ఉంద న్నారు. ఏటా వేలాదిమంది ప్రజలు ఇక్కడకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారన్నారు. ఎండోమెంట్ అధికారి రామలింగారెడ్డి, టీడీపీ నేతలు రామచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, మన్యం సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బైసాని రామచంద్రారెడ్డి, బిజివేముల మహేందర్‌రెడ్డి, బైసాని పుల్లారెడ్డి, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఇద్దరు చిన్నారులపై దాడి

కలసపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఎగువ రామాపురంలో ఓ పిచ్చి కుక్క వీధుల వెంట తిరుగుతూ చిన్న పిల్లలపై వెంట పడి దాడి చేసింది. ఈ దాడిలో రామాపురం వాసులు మహబూబ్ బాషా కుమార్తె, మనహ అజ్రీనా, అమ్మమ్మ ఇంటికి వచ్చిన వనిపెంట బాలుడిని గాయపర్చింది. వీరికి కలసపాడు ఆరోగ్యకేంద్రం వైద్యులు చికిత్స చేయించారు. స్థానికులు పిచ్చి కుక్కను కొట్టి చంపారు.

పీ4 సర్వేకి ప్రజలు సహకరించాలి

ప్రొద్దుటూరు రూరల్/ఎర్రగుంట్ల/దువ్వూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్ర తిష్టాత్మకంగా చేపట్టిన పి4 (పబ్లిక్ ప్రైవేటు పీపుల్ పార్ట్‌నర్ షిప్) సర్వేకి ప్రజలందరూ సహకరించాలని ఆయా ఎంపీడీఓలు సూర్యనారాయణరెడ్డి, వెంకటరమణయ్య, రామకృష్ణయ్య పేర్కొన్నారు. నిరుపేదలు ప్రజలకు సంఘంలో ఆర్థికంగా బలోపేతమైన వ్యక్తుల నుంచి, ఆర్థిక, మౌలిక సదుపాయాలు కల్పించడమే సర్వే ఉద్దేశమన్నారు. ప్రభుత్వ పథకాలు యధాతధంగా ఉంటాయన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు పోకుండా సచివాలయ సిబ్బంది ఇండ్ల వద్దకు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ వారికి సమాచారం అందించి సర్వేలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'వెలిగొండ'కు రూ.2వేల కోట్లు కేటాయించాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు రాష్ట్రబడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ 1996లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు శంకుస్థాపన చేసినా ఇంత వరకూ పూర్తి చేయలేదన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, భైరవప్రసాద్, గౌసియాబేగం పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకోసం కృషి చేయాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి లక్ష్యసాధనకోసం కృషి చేయాలని వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేదవ్యాస డిగ్రీ కళాశాల వార్షికోత్సవాలు వాసవీ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ రంగం, సివిల్‌సర్వీస్, పబ్లిక్ సర్వీస్‌లో ఉద్యోగాలు సాధించడానికి అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యాన్ని సాధించినప్పుడు ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. కళాశాల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగినప్పుడే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జనసేన నేత మాదాసు మురళి, అధ్యాపకులు నాగరాజు, రామలక్ష్మిరెడ్డి, కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వర్గాలకు అనుకూలమైన బడ్జెట్

బద్వేలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ వర్గాలకు అనుకూలం, పేదలకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం, సీపీఐ ఎంఎల్ పార్టీ నేతలు శ్రీను, చంద్రమోహన్‌రాజు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు నిధులు పెంచాలని, పెట్రోలియం ఉత్పత్తులపై సెస్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ నేతలు చిన్ని, మస్తాన్, రాయప్ప, జకరయ్య, బాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు తగదు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లపై అధికార పార్టీ నేతల వేధింపులు తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాయలంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గోపవరం పంచాయతీలో సుమారు 20 ఏళ్లగా పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్‌ను మానుకోవాలని అధికార పార్టీ నేత ఒకరు వత్తిడి తెస్తున్నాడన్నారు. రాజానామా చేస్తే మా వారిని నియమించుకుంటామని ఆమెను బెదిరించడం దారుణమన్నారు. గతంలో గుంటూరులో ఒక అంగన్వాడీ వర్కర్‌ను తొలగిస్తే అంగన్వాడీ వర్కర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని, దీంతో ప్రభుత్వం సీడీపీఓను సస్పెండ్ చేసిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా అంగన్వాడీ వర్కర్‌ను వేధించడం మానుకోవాలని లేదంటే ఆందోళన చేపడతామని స్పష్టం చేవారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయకుమార్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



వీరభద్రస్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

చాపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం రాత్రి వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారిని హంసవాహనంపై ఊరేగించారు. సుబ్రమణ్యేశ్వరుడు, గణపతి, త్రిశూలేశ్వరుడు, చండీశ్వరుడు స్వాములవారిని పల్లకీలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి అలంకరణ చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు. 26న మహాశివరాత్రి పండుగకు సంబంధించిన దేవస్థానం చరిత్ర పుస్తకాలను, కరపత్రాలను ఛైర్మన్, ఈఓ విడుదల చేశారు.

బాలల చట్టాలపై అవగాహన

ఖాజీపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు చెడుకు ఆకర్షితులు కాకుండా మంచి నడవడికతో ఉండాలని కడప యాంటీ హ్యూమన్ షాపింగ్, ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష అన్నారు. మంచి, చెడు స్పర్శలపట్ల అవగాహన ఉన్నట్లయితే తమను తాము రక్షించుకోగలరన్నారు. బాల్య వివాహాలు ఎక్కడ జరుగుతున్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంఈఓలు నాగస్వర్ణలత, నాగరాజు, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల వికాసానికి అంగన్‌వాడీ పునాది

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు శారీరక మానసిక వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే గట్టి పునాదులు పడాలని ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి పేర్కొన్నారు. గురువారం ఐసీడీఎస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లకు స్థానిక అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో వారంపాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. సీడీపీఓ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు శారీరక, మానసిక వికాసంతో పాటు విద్యాబుద్ధులు, ఆటపాటలు ఎలా నేర్పాలో ప్రత్యేక శిక్షకులు నేర్పుతారన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఈశ్వరి కళావతి తదితరులు పాల్గొన్నారు.

● **కలసపాడులో**: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణలో భాషా పరిజ్ఞానంపై ఎంఈఓ, కోర్సు డైరెక్టరు పీజే ప్రేమ్‌సాగర్ మాట్లాడారు. డీఆర్పీ శివారెడ్డి, భూతపాటి ప్రభాకర్, సీఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిపై శిక్షణ

● **రాజుపాలెంలో**: అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు ఐసీడీఎస్ అధికారి అరుణకుమార్ అన్నారు. గురువారం రాజుపాలెం జడ్పీ హైస్కూలు ఉన్నత పాఠశాలల మహిళా శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణనిర్వహించారు.

ఆత్మగౌరవం కోసం పోరాటం

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తాము చేస్తున్నది ఆత్మగౌరవ పోరాటమని, అందరితో సమానంగా ఉపకార వేతనాలు అందించే వరకు సమ్మెను విరమించబోమని విద్యార్థులు తేల్చిచెప్పారు. 18వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం కళాశాల ఆవరణలో వెటర్నరీ విద్యార్థులు బైఠాయించి సమ్మె చేశారు. రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న అన్ని రంగాల వైద్య విద్యార్థులకు ఒకలా, వెటర్నరీ విద్యార్థులను మరోలా చూడడం దారుణమన్నారు. న్యాయపర డిమాండ్లపై అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద విన్నవించుకున్నా చలనం లేదని వాపోయారు.

26న నగరేశ్వరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో 26న మహాశివరాత్రి సందర్భంగా పార్వతీ సమేత నగరేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని, రాత్రి 10 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు.

రేపు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం సుబ్బమ్మ పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్, ఎల్ఐసీ, బెల్‌స్టార్, మైక్రోఫైనాన్స్‌లో ఉద్యోగ అవకాశాల కోసం 22నశనివారం 10 గంటలకు వెలుగు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు. వివరాలకు 9000401382 సంప్రదించాలన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేసే దిశగా ప్రతి ఒక్క అధికారి అంకితభావంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం గోపవరం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. పంచాయతీ పరిధిలో జరగవలసిన అభివృద్ధిపై సమీక్షించారు. సర్పంచ్ మోసే, పంచాయతీ సెక్రటరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేరుకున్న చెత్త తొలగింపు



ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తరలించే పనులు చేపట్టారు. సర్పంచ్ శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ వాహనాలతో చెత్తను రాళ్ల గనుల గుంతల్లో వేస్తున్నారు. కొన్నేళ్లగా కొత్తపల్లెకు డంపింగ్ యార్డు లేకపోవడంతో చెత్తను పంచాయతీ కార్యాలయ ఆవరణలోని ఖాళీ స్థలంలో పోగు చేస్తూ వచ్చారు. నిల్వలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో కొంత కాలం చెత్తకు నిప్పు పెట్టారు. కాలుష్య సమస్య ఏర్పడుతోందని స్థలాన్ని కేటాయిస్తే డంపింగ్ యార్డును తరలిస్తామని జాయింట్ కలెక్టర్ అతిథిసింగ్ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. ఎట్టకేలకు చెత్తను జనావాసాలకు దూరంగా తరలించే పనులు ముమ్మరం చేశారు.

అర్హులకు ఇంటిస్థలాలు ఇస్తాం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటిస్థలాలు ఇస్తామని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు, మండలాల్లోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు తహసీల్దారును కలిసి ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు.

కక్షసాధింపు తగదు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బద్వేలులో పేదల గుడిసెలపై రెవెన్యూ అధికారుల కక్షసాధింపు చర్యలు మానుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మిడుతూరు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బద్వేలులో జానెడు స్థలంలేని నిరాశ్రయులు కమ్యూనిస్టు పార్టీ ఆశ్రయంతో వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు బద్వేలు రెవెన్యూ యంత్రాంగం కక్షసాధింపుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దళితులు, పేదల గుడిసెలపై చట్టం పేరుతో అధికారులు ఇబ్బంది పెట్టడం తగదన్నారు. గండికోట, ఆర్అండ్ఆర్ కాలనీ శివార్లలో పొన్నతోట, సచివాలయం సమీపాన ఇష్టారాజ్యంగా పేదల స్థలాలను కొందరు ఆక్రమించారని ఆరోపించారు. జిల్లా అధికారులు పేదల స్థలాలు, ఇళ్లపై కక్షసాధింపు మానుకోవాలన్నారు. బాధితులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యమాన్ని రైతులతో చేయించి పర్యావరణాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోరారు. కామనూరు, తాళ్లమాపురం, కల్లూరు పంచాయతీల్లోని గ్రామ సమాఖ్యల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసేలా తన మద్దతు ఉంటుందన్నారు. ఈ ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

ఎర్రగుంట్లలో సీపీ విడుదల

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ సర్క్యులేషన్ నెట్ వర్క్స్ ప్లాన్‌ను కమిషనర్ శేషఫణి, ఏపీఓ వెంకటరమణారెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఎర్రగుంట్ల బళ్లారి హైవేకి ఇరువైపులా ఉన్న న్యూ కాలనీ, మమాత్మానగర్‌లోని కొన్ని వీధుల్లో రోడ్డు విస్తీర్ణం నిర్ణయిస్తూ వీటిని తయారు చేశారు. ఎర్రగుంట్లలోని ఓల్డ్ బిల్ట్‌అప్ గ్రామకంఠము, అగాడి ఏరియాల్లో ముసాయిదా సీపీలకు ఆమోదం తెలిపినట్లు కమిషనర్ తెలిపారు. ఈ నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచీ ఏడు రోజుల్లోపు ప్రజల నుంచి రాతపూర్వకంగా లేదా మెయిల్ ద్వారా సీపీ సరళిని సూత్రప్రాయంగా ఆమోదించడంపై అభ్యంతరాలు, సూచనలను కోరుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

రైతులు తిరగబడితే చూస్తారా ?

● ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, బాధితుల హెచ్చరిక

జమ్మలమడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యాజమాన్యం పెడుతున్న ఇబ్బందులు పట్ల రైతులు తిరగబడితే ఎలా ఉంటుందో చూస్తారా అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి బాధిత రైతులు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ నిర్లక్ష్యంతో కాలుష్యపు, బ్లాస్టింగ్ కోరల్లో ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రజలు లోకాయుక్తను ఆశ్రయించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టినప్పటి నుంచీ దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్నకొమెర్ల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఏటా రైతులు సాగు చేసిన పంటలు దాల్మియా దస్తు, బ్లాస్టింగ్, కాలుష్యంతో పంటలు సక్రమంగా పండక వర్షాకాలంలో వచ్చిన వరదనీరు పొలాల్లో చేరి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమస్యలన్నీ జిల్లా అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. దీంతో బాధిత రైతులు, ప్రజలు లోకాయుక్తను ఆశ్రయించారన్నారు. జరిగిన నష్టాలు, ప్రస్తుత పరిస్థితి తెలపాలని రెవెన్యూ, కలెక్టర్, ఇరిగేషన్, తదితర అధికారులను లోకాయుక్త కోరింది. ఇరిగేషన్ రిపోర్టును బేఖాతరు చేస్తూ రెవెన్యూ తహసీల్దారు, ఆర్డీఓ, కలెక్టర్ తప్పుడు రిపోర్టులు ఇచ్చారని లోకాయుక్త తప్పు పట్టిందన్నారు. దాల్మియా భూములు, ఇండ్లను కొనుగోలు చేసి శాశ్వత పరిష్కారం చేయాలని కోరినట్లు బాధిత రైతులు కోరారు.